# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 305 | గురువారం 27 జూన్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# మోదీ VS సంఘ్



- వేగంగా మారుతున్న జాతీయ రాజకీయాలు
- బీజేపీకి క్లీన్ మెజారిటీ రాకపోవడం, ప్రభుత్వ ఏర్పాటులో మిత్ర పక్షాలపై ఆధార పడటంతో అడుగడుగునా ప్రధాని మోదీకి సవాళ్లు
- గతంలో మోదీని గ్లోబల్ లీడర్‌గా ప్రమోట్ చేసిన ఆర్‌ఎస్ఎస్, బీజేపీ నేతలే ఆయనకు ఇప్పుడు ఇబ్బందికరంగా మారుతున్నారని విశ్లేషకుల అభిప్రాయం
- అమిత్ షా ఎన్డీఏ 3.0లో అలాంటి పరిస్థితి లేదు. ప్రభుత్వ నిర్ణయాలే కాదు..
- పార్టీలో కూడా ప్రధాని మాట ఏకపక్షంగా జరిగే అవకాశం లేదు.

3లో

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జాతీయ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. బీజేపీకి క్లీన్ మెజారిటీ రాకపోవడం, ప్రభుత్వ ఏర్పాటులో మిత్ర పక్షాలపై ఆధార పడటంతో అడుగడుగునా ప్రధాని మోదీకి సవాళ్ల ఎదురవుతున్నాయి. గతంలో మోదీని గ్లోబల్ లీడర్‌గా ప్రమోట్ చేసిన ఆర్‌ఎస్ఎస్, బీజేపీ నేతలే ఆయనకు ఇప్పుడు ఇబ్బందికరంగా మారుతున్నారన్న వార్తలు పెరుగుతున్నాయి. గతంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్న మోదీ, అమిత్ షా ఎన్డీఏ 3.0లో అలాంటి పరిస్థితి లేదు. ప్రభుత్వ నిర్ణయాలే కాదు.. పార్టీలో కూడా ప్రధాని మాట ఏకపక్షంగా జరిగే అవకాశం లేదు.ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డానే మోడీ తన కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకున్నారు. దీంతో.. బీజేపీ కొత్త సారథిని ఎన్నుకునే పనిలో పడింది. ఈ విషయంలోనే మోదీ, ఆర్‌ఎస్ఎస్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోందనే ప్రచారం ఢిల్లీ వర్గాల్లో నడుస్తోంది.



## కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి సోనియాగాంధీ ఫోన్

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఢిల్లీ అధిష్ఠానం నుంచి ఫోన్ కాల్
- వెంటనే ఢిల్లీకి రావాల్సిందిగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఏఐసీసీ నుంచి పిలుపు
- జీవన్ రెడ్డిని ఢిల్లీకి తీసుకురావాల్సిందిగా విప్ అడ్లూరి లక్ష్మణ్‌ను కాంగ్రెస్ పెద్దలు ఆదేశం

హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను పార్టీలో చేకూర్చుకోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఢిల్లీ అధిష్ఠానం నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఏకంగా పార్టీ అగ్ర నాయకురాలే ఆయనకు ఫోన్ - మిగతా3లో

# వికటిస్తున్న ఆపరేషన్ ఆకర్ష్

- కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలనుకుంటున్నారో.. భారత రాష్ట్ర సమితిని బలహీనం చేయాలనుకుంటున్నారో కానీ చాలా దూకుడుగా వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు సైలెంట్ ఆపరేషన్స్‌కు తెర లేపారు
- కేసీఆర్ కు అత్యంత సన్నిహితులుగా పేరు పడిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల సంజయ్ కుమార్‌లకు మూడో కంటికి తెలియకుండా కండువా కప్పేశారు.
- రాత్రికి రాత్రి కాంగ్రెస్ పార్టీ నేతలుగా మార్చేస్తే.. తామేం చేయాలని మథనపడుతున్న ఆయా నియోజకవర్గాల క్యాడర్లు



హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలనుకుంటున్నారో.. భారత రాష్ట్ర సమితిని బలహీనం చేయాలనుకుంటున్నారో కానీ పీసీసీ చీఫ్ కమ్ సీఎం రేవంత్ రెడ్డి చాలా దూకుడుగా వెళ్తున్నారు. కాంగ్రెస్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు సైలెంట్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నారు. కేసీఆర్ కు అత్యంత సన్నిహితులుగా పేరు పడిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల సంజయ్ కుమార్‌లకు మూడో కంటికి తెలియకుండా కండువా కప్పేశారు. వారు పార్టీలో చేరిన తర్వాతే విషయం బయటకు తెలిసింది. ఇది బీఆర్ఎస్ నేతలకే కాదు కాంగ్రెస్ నేతలకు కూడా షాక్‌గా మారింది. ఇప్పటి వరకూ తాము ఎవరిపై పోరాడామో వారిని తీసుకొచ్చి రాత్రికి రాత్రి కాంగ్రెస్ పార్టీ నేతలుగా మార్చేస్తే.. తామేం చేయాలని ఆయా నియోజకవర్గాల క్యాడర్లు మథనపడుతున్నారు. పదేళ్లుగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పై పోరాడానని - మిగతా3లో

# వారంలో కొత్త బాస్?

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మారుస్తా రంటూ కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం
- స్టేట్ ప్రెసిడెంట్ బాధ్యతలు ఎవరనే అంశంపై తీవ్ర ఉత్కంఠ
- హైకమాండ్ ఎవరికి చాన్స్ ఇవ్వనుందనేది హాట్ టాపిక్
- టీ బీజేపీ కొత్త ప్రెసిడెంట్ పోస్టు కోసం ఎవరికి వారుగా పలువురు నేతలు ప్రయత్నాలు



హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మారుస్తా రంటూ కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. స్టే ట్ ప్రెసిడెంట్ బాధ్యతలు ఎవరనే అంశంపై తీవ్ర ఉత్కంఠ నె లకొంది. అయితే ఈ సస్పెన్స్‌కు మరో వారంలో బ్రేక్ పడే అవకాశమున్నట్లు తెలుస్తోం ది. హైకమాండ్ ఎవరికి చాన్స్ ఇవ్వనుందనేది హాట్ టాపిక్‌గా మారింది. ఆది నుంచి మల్కాజిగి రి ఎంపీ ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.తెలంగాణలో 8 స్థానాల్లో కాషాయ పార్టీ గెలుపొందడంతో హైకమాండ్ ఇద్దరిని కేంద్ర మంత్రులను చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్ రెడ్డికి బొగ్గు, గనుల శాఖను కేటాయించింది. బండి సంయ్‌ని కేంద్ర హోంశాఖ సహాయ మం త్రిగా నియమించింది. కేంద్ర మంత్రిగా నియమిం చడంతో పాటు కిషన్ రెడ్డిని జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జిగా సై తం ఇటీవలే నియమించింది. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన దాదాపు 20 రోజుల వరకు తెలంగాణకు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ మూడు వారాలు టైం గ్యాప్ ఉండటంతో పార్టీ వ్యవహారాలకు ఇబ్బందిగా మారే చాన్స్ ఉందని సమాచారం.టీ బీజేపీ - మిగతా3లో



## దోడాలో ఎన్‌కౌంటర్

- భద్రతా బలగాల కాల్పుల్లో టెర్రరిస్టు హతం
- ఒక చైనా హ్యాండ్ గ్రనేడ్‌ను స్వాధీనం
- ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో భాగంగా దోడా జిల్లాలోని ఎన్‌కౌంటర్
- ఉగ్రవాదుల కదలికలపై నిఘా కోసం రంగంలోకి ఆర్మీ హెలికాప్టర్

# రోడ్ల అభివృద్ధికి నిధుల విడుదల చేయండి



- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం
- భేటీలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు
- రాష్ట్ర రహదారులపై సుదీర్ఘ చర్చ
- ఫ్లైఓవర్ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్డు సహా పలు ప్రాజెక్టులపై చర్చ

ఢిల్లీ

రీజనల్ రింగ్ రోడ్డుపై తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఈరోజు (బుధవారం) సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన అంశాలను మీడియాకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రానికి కావాల్సిన రోడ్ల నెట్‌వర్క్‌కు కావాల్సిన అంశాలపై ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణలో రోడ్డు నెట్‌వర్క్ విస్తరణ పైన - మిగతా3లో

# ఇక కేరళం



**తిరువనంతపురం :** కేరళ పేరును కేరళంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఆ తీర్మానాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అన్ని పార్టీలు మద్దతు తెలపడంతో తీర్మానం శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. అయితే సీఎం పినరయి ప్రవేశపెట్టిన తీర్మానానికి విపక్షాలు కొన్ని సవరణలు ప్రతిపాదించాయి. గతేడాది ఆగస్టు 9వ తేదీన కూడా కేరళ పేరును కేరళంగా మార్చాలని కోరుతూ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. రాజ్యాంగంలో ఈ విషయాన్ని మొదటి షెడ్యూల్, ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరింది. తొలి తీర్మానం పరిశీలన తర్వాత, కొన్ని మార్పులు చేయాలని కోరింది కేంద్ర ప్రభుత్వం. దీంతో మార్పులు చేసిన తర్వాత తాజాగా మరోసారి రాజ్యాంగంలోని ఎనిమిదో జాబితాలో పేరు మార్పు విషయాన్ని చేర్చాలనే తీర్మానాన్ని పంపింది కేరళ ప్రభుత్వం.కేరళ పేరును అన్ని భాషల్లోనూ కేరళంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని పినరయి సర్కార్ కోరింది. రాష్ట్రంపేరును పూర్వం నుంచే మలయాళం అని పిలిచేవారని, మలయాళం మాట్లాడే ప్రజల కోసం ఐక్య కేరళ రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ పూర్వ కాలం నుండే ఉందని కేరళ సీఎం పినరయి విజయన్ తెలిపారు. కేరళల సాంస్కృతిక నేపథ్యం, చరిత్రను దృష్టిలో ఉంచుకుని కేరళంగా పేరు మార్చాలనే డిమాండ్ అన్నివర్గాల ప్రజలనుంచి ఉందన్నారు. మరోవైపు దేశంలో ఏదైనా రాష్ట్రంపేరును మార్చాలంటే రాజ్యాంబద్ధంగా కేంద్రం ఆమోదం పొందాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోనే ఆ రాష్ట్రం పేరును మార్చాల్సి ఉంటుంది. రాష్ట్రం పేరు మార్చడం అనేది కేంద్ర ప్రభుత్వ పరిధికి సంబంధించిన అంశం. మరి ఈసారైనా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కేరళ మార్పుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అన్నది ఆసక్తిగా మారింది.

## కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి యూపీ కోర్టు సమన్లు..



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి యూపీ కోర్టు బుధవారం సమన్లు జారీ చేసింది. కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాపై అభ్యంతర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై పరువు నష్టం కేసు నమోదైంది. ఈ కేసులో జూలై 2న తమ ఎదుట హాజరుకావాలని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు రాహుల్ గాంధీని కోరింది. కేసు తదుపరి విచారణ జూలై 2న జరుగనున్నది. సుల్తాన్‌పూర్ జిల్లా సహకార బ్యాంకు మాజీ చైర్మన్, బీజేపీ నేత విజయ్ మిశ్రా ఆగస్టు 4, 2018లో రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు వేశారు. జూలై 15న కర్ణాటక రాజధాని బెంగళూరులో హెూంమంత్రి అమిత్‌షాపై రాహుల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. 2018తో పాటు గతేడాది నవంబర్ 27న కోర్టు కాంగ్రెస్ నేతను విచారణకు పిలిచింది. ఫిబ్రవరి 20న రాహుల్ గాంధీ కోర్టుకు హాజరై బెయిల్‌ను పొందారు. అయితే, అప్పటి నుంచి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసే ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నది. అయితే, ఈ నెల 7న కొత్వాలి నగర్‌కు చెందిన రామ్ ప్రతాప్ అనే వ్యక్తి ఈ కేసులో తనను పార్టీగా మార్చాలని కోర్టును కోరారు. అయితే, దీన్ని బీజేపీ నేత విజయ్ మిశ్రా తరఫు న్యాయవాది సంతోష్ పాండే వ్యతిరేకించారు. కేసును జాప్యం చేసేందుకు పిటిషన్ దాఖలు చేశారని ఆరోపించారు. అయితే, పిటిషన్ కోర్టు తిరస్కరించింది. వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు రాహుల్ గాంధీకి సమన్లు పంపాలని కోర్టు ఆదేశించింది. విచారణను జూలై 2వ తేదీకి వాయిదా వేసింది.

## ప్రాంతీయ పార్టీలను ఖతం చేయాలని బీజేపీ స్కెచ్




ఆపరేషన్ లోటస్ ద్వారా ప్రాంతీయ పార్టీలను ఖతం చేయాలని బీజేపీ కోరుకుంటోందని శిరోమణి అకాలీ దళ్ ఢిల్లీ చీఫ్ పరంజిత్ సింగ్ సర్నా బుధవారం ఆరోపించారు. ఇది బూటకపు ఆరోపణ అని కాషాయ పార్టీ భావిస్తే ఆ పార్టీ నేతలను తాను చర్చకు ఆహ్వానిస్తానని, వారు ఆపరేషన్ లోటస్ చేపట్టినట్టు నిరూపిస్తానని ఆయన సవాల్ విసిరారు. ప్రాంతీయ పార్టీలను కబళించాలని, నిర్వీర్యం చేయాలని బీజేపీ భావిస్తోందని, దీన్ని తాము అడ్డుకుంటామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో అకాలీ దళ్ వెనుకబడిన క్రమంలో పార్టీ చీఫ్ సుఖ్బీర్ సింగ్ బాదల్ వైదొలగాలని కొందరు పార్టీ నేతలు అసమ్మతి గళం వినిపించిన క్రమంలో పరంజిత్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్గతంగా అసమ్మతి ఎదుర్కొంటున్న బాదల్‌కు లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మరింత ప్రతికూలంగా మారాయి. పార్టీ నాయకత్వంలో మార్పులు చేపట్టాలని సీనియర్ నేతలు పర్మీందర్ సింగ్ ధిండ్సా, బిది జాగీర్ కౌర్ సహా పలువురు తిరుగుబాటు బావుటా ఎగరవేయగా, మరికొందరు సీనియర్ నేతలు బాదల్‌కు బాసటగా నిలిచారు. ఇక ఈ ఆరోపణలపై ఎస్‌ఏడీ ఎంపీ, బాదల్ సతీమణి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ స్పందిస్తూ ఎస్‌ఏడీ పార్టీ శ్రేణులన్నీ బాదల్ వెనుక నిలిచాయని, కొందరు బీజేపీ నేతలు ఎస్‌ఏడీని చీల్చాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వారు మహారాష్ట్రలోనూ ఇదే చేశారని దుయ్యబట్టారు. 117 మంది నేతల్లో కేవలం అయిదుగురు మాత్రమే బాదల్‌కు వ్యతిరేకంగా ఉన్నారని, మిగిలిన 112 మంది నేతలు పార్టీ పట్ల, సుఖ్బీర్ సింగ్ బాదల్ నాయకత్వం పట్ల సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారని చెప్పారు.

## డబుల్ ఇంజిన్ సర్కార్‌లో వ్యాపారంగా మారిన ప్రభుత్వ నియామకాలు

నీట్ రగడ, ప్రశ్నా పత్రాల లీకేజ్, పరీక్షల వాయిదా వ్యవహారాలపై కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో సర్కార్ నియామకాలు వ్యాపారంగా మారాయని ఆరోపించారు. దిగ్విజయ్ సింగ్ యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో విలేకరులతో మాట్లాడారు. యూపీలో ప్రశ్నాపత్రాల లీకేజ్ సర్వసాధారణంగా మారిందని దుయ్యబట్టారు.

# జూలై ఒకటి నుంచి కొత్త క్రిమినల్ చట్టాల అమలుకు సన్నాహాలు!




కేంద్రం తీసుకువచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు జూలై ఒకటి నుంచి అమలులోకి తీసుకువచ్చేందుకు హెూంమంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తున్నది. ఇందు కోసం 40లక్షల మంది క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చింది. దాంతో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించబోతున్నది. కేంద్రం భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య పేరులతో కొత్త చట్టాలను తీసుకువచ్చింది. బ్రిటిష్ కాలంనాటి ఇండియన్ పీనల్ కోడ్ 1860, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 స్థానంలో జూలై నుంచి కొత్త చట్టాలు అమల్లోకి రాబోతున్నాయి. మూడు కొత్త చట్టాలపై 5.65 లక్షల మంది పోలీసులు, జైలు, ఫోరెన్సిక్, జ్యుడీషియల్, ప్రాసిక్యూషన్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కొత్త క్రిమినల్ చట్టాలు దర్యాప్తు, విచారణ, కోర్టు విచారణలో సాంకేతికత నొక్కి చెప్పగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రస్తుత క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్ అప్లికేషన్‌లో 23 సవరణలు చేసింది. దీని కింద ఇప్పుడు ప్రతి పోలీస్ స్టేషన్‌లో అన్ని కేసులు నమోదు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఎన్‌సీఆర్‌బీ కొత్త వ్యవస్థ కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సాంకేతిక సహాయాన్ని సైతం అందిస్తుంది. కొత్త క్రిమినల్ చట్టాల అమలులో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నిరంతరం సహాయం చేయడానికి ఇది 36 సహాయక బృందాలు, కాల్ సెంటర్‌లను ఏర్పాటు చేసింది. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సామర్థ్యం పెంపుదల కోసం శిక్షణా మాడ్యూల్స్‌ను రూపొందించింది. బ్యూరో 250 శిక్షణా కార్యక్రమాలు, వెబ్‌నార్స్, సెమినార్‌లను కూడా నిర్వహించింది, ఇందులో 40,317 మంది అధికారులు, సిబ్బంది శిక్షణ పొందారు.

## లోక్‌సభ స్పీకర్‌గా తొలి ప్రసంగంలోనే

# ఓం బిర్లా నోట ఎమర్జెన్సీ మాట



**న్యూఢిల్లీ:** పద్దెనిమిదవ లోక్‌సభ స్పీకర్‌గా బుధవారంనాడు ఎన్నికైన ఓం బిర్లా తొలి ప్రసంగంలోనే 1975లో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితి ని సభలో ప్రస్తావించడం కలకలం రేపింది. ఆయన వ్యాఖ్యలపై విపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. నాటి అత్యవసర పరిస్థితి చరిత్రలోనే బ్లాక్ ఛాప్టర్‌గా నిలిచిపోతుందని స్పీకర్ అన్నారు. 1975లో విధించిన ఎమర్జెన్సీ నిర్ణయాన్ని లోక్‌సభ ఖండిస్తోందని చెప్పారు. "1975 నాటి ఎమర్జెన్సీ నిర్ణయాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తోంది. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా భారత ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడిన వారందరినీ సభ అభినందిస్తోంది. భారతదేశ చరిత్రలో 1975 జూన్ 25వ తేదీ బ్లాక్‌డేగా నిలిచిపోతుంది. ఆరోజు అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దేశంలో అత్యవసర పరిస్థఇతి విధించి, బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై దాడి చేశారు" అని ఓం బిర్లా లోక్‌సభలో చేసిన తొలి ప్రసంగంలో పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య విలువలను తుంగలోకి తొక్కి, భావ ప్రకటనా స్వేచ్ఛ గొంతు నులిమారని అన్నారు. ప్రజాస్వామ్యానికి భారతదేశం తల్లిలాంటిదనే విషయం యావత్ ప్రపంచానికి తెలుసునని, ప్రజాస్వామ్య విలువలు, దానిపై చర్చకు ఇండియా ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందన్నారు. వాటి పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రాణాలు కోల్పోయిన వారి స్మృత్యర్థం రెండు నిమిషాల మౌనాన్ని ఆయన పాటించారు. ఇందుకు ప్రతిగా కొత్త లోక్‌సభలో ఎమర్జెన్సీ ప్రస్తావనపై విపక్ష నేతలు నిరసన వ్యక్తం చేస్తూ, నినాదాలు చేశారు. లోక్‌సభ కొత్త స్పీకర్‌గా ఓం బిర్లా బుధవారంనాడు మూజువాణి ఓటుతో ఎన్నికయ్యారు.

## ప్రజ్వల్ రేవణ్ణకు చుక్కెదురు.. బెయిలుకు ప్రత్యేక కోర్టు నిరాకరణ



**బెంగళూరు:** లైంగిక దాడుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ, జేడీ(ఎస్) బహిష్కృత నేత ప్రజ్వల్ రేవణ్ణకు చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ అభ్యర్థనను ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక ప్రజా ప్రాతినిధ్య కోర్టు బుధవారంనాడు తోసిపుచ్చింది. హెూలెనరసిపుర పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ప్రజ్వల్, ఆయన తండ్రి హెచ్‌డీ రేవణ్ణ నిందితులుగా ఉన్నారు. లైంగిక నేరాల కేసులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) కస్టడీలో ప్రస్తుతం ప్రజ్వల్ ఉన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ ప్రమేయం ఉన్నట్టు చెబుతున్న లైంగిక దాడుల వీడియోలు 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు వెలుగులోకి రావడం ఒక్కసారిగా సంచలనమైంది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం 'సిట్'ను ఏర్పాటు చేయగా, అప్పటికే జర్మనీ పారిపోయిన ప్రజ్వల్ సిట్ చర్యలతో దిగొచ్చారు. సిట్ విజ్ఞప్తితో బ్లూ కార్నర్ నోటీసును ఇంటర్‌పోల్ జారీ చేసింది. ఈ క్రమలో మే 31న విచారణ కోసం జర్మనీ నుంచి తిరిగొచ్చిన ప్రజ్వల్‌ను సిట్ అదుపులోనికి తీసుకుంది. కాగా, పలువురు మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలపై ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు సూరజ్ రేవణ్ణను కూడా పోలీసులు గత శనివారం అరెస్టు చేశారు.

## ఎమర్జెన్సీని తలపిస్తోన్న మోదీ సర్కార్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌పై సునీతా కేజ్రీవాల్



ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్ట్ చేయడంపై ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ స్పందించారు. కేజ్రీవాల్‌ను జైల్లో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం తన వ్యవస్థలన్నింటినీ ప్రయోగిస్తోందని ఇది నియంతృత్వం, ఎమర్జెన్సీని తలపిస్తోందని ఆమె ఆరోపించారు. కేజ్రీవాల్‌కు జూన్ 20న బెయిల్ లభించగా, వెంటనే ఈడీ స్టే ఉత్తర్వులు తీసుకుంది..ఆ మరుసటి రోజే సీబీఐ ఆయనపై అభియోగాలు మోపింది ఇవాళ ఆయనను అరెస్ట్ చేశారని సునీతా కేజ్రీవాల్ వివరించారు. కేజ్రీవాల్‌ను జైలు నుంచి బయటకు రాకుండా వ్యవస్థలన్నింటినీ కేంద్రం ప్రయోగిస్తోందని ఆమె మండిపడ్డారు. ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి సీబీఐ బుధవారం కేజ్రీవాల్‌ను కోర్టు రూం నుంచే అరెస్ట్ చేసింది. కోర్టు రూంలో కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఢిల్లీ కోర్టు వెకేషన్ జడ్జి సీబీఐని అనుమతించారు. మరోవైపు ఎమర్జెన్సీ విధించి 50 ఏండ్లు అయిన సందర్భంగా ఎన్డీయే సభ్యులు పార్లమెంట్ ఆవరణలో నిరసనలు చేపట్టారు. ఎమర్జెన్సీ చీకటి రోజులకు కారణమైన కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకుముందు లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి ఎన్నికైన ఓం బిర్లా ఎమర్జెన్సీని ఖండించారు. అప్పట్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా రెండు నిమిషాల పాటు సభలో మౌనం పాటించారు.

## దోడాలో ఎన్‌కౌంటర్..



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో భాగంగా దోడా జిల్లా బజాద్ గ్రామంలోని గండోహ్ ప్రాంతంలో బుధవారంనాడు ఉదయం 9.50 గంటల ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా బలగాలకు, టెర్రరిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఒక టెర్రరిస్టు హతమయ్యాడు. కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల కదలికలపై నిఘా కోసం ఆర్మీ హెలికాప్టర్‌ను కూడా రంగంలోకి దింపారు. ఈనెల 11, 12 తేదీల్లో ఇక్కడి కొండ ప్రాంతంలో జంట ఉగ్రదాడులు చోటుచేసుకోవడంతో ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఆ ప్రాంతంలో జల్లెడపడుతున్నాయి. చాత్తర్‌గల్లాలోని జాయింట్ చెక్‌పోస్ట్‌పై జూన్ 11న ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఆరుగురు భద్రతా సిబ్బంది గాయపడగా, ఆ మరుసటి రోజు కోటా టాప్‌లోని గందోహ్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో ఒక పోలీసు గాయపడ్డారు. నలుగురు పాకిస్తాన్ టెర్రరిస్టులు ఈ ఉగ్ర ఆపరేషన్ జరిపినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక్కొక్కరి ఆచూకీ చెప్పిన వారికి రూ.5 లక్షల చొప్పున రివార్డును కూడా ప్రకటించారు. సినో పంచాయత్‌లో భద్రతా బలగాల సహకారంతో పోలీసులు గాలింపు చర్యలు జరుపుతుండగా, అక్కడ తలదాచుకున్న ఉగ్రవాదులు కాల్పులకు తెగబడుతున్నారు.

**చైనా గ్రనేడ్ స్వాదీనం..**

కాగా, రాజౌరి జిల్లా పిండ్ గ్రామంలోని చింగుస్ ప్రాంతం నుంచి భద్రతా బలగాలు ఒక చైనా హ్యాండ్ గ్రనేడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. భద్రతా బలగాల గస్తీ బృందానికి మంగళవారం సాయంత్రం ఈ గ్రనేడ్ కనిపించినట్టు అధికారులు తెలిపారు.

# ఉత్తుత్తి బెదిరింపులకు బెదరను.. 'జై పాలస్తీనా' వ్యాఖ్యల దుమారంపై ఒవైసీ



**న్యూఢిల్లీ:** పార్లమెంటులో ఎంపీగా ప్రమాణస్వీకారం చేస్తూ చివర్లో 'జై పాలస్తీనా' అని నినదించడం విమర్శలకు దారితీయడంతో ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ బుధవారంనాడు తొలిసారి స్పందించారు. పార్లమెంటులో తాను చేసిన వ్యాఖ్యలను ఆయన సమర్థించుకుంటూ "ఉత్తుత్తి బెదిరింపులకు బెదిరేది లేదు" అని వ్యాఖ్యానించారు. ఐదుసార్లు హైదరాబాద్ ఎంపీగా ఉన్న ఒవైసీ ప్రమాణస్వీకారం చివర్లో 'జై తెలంగాణ, జై పాలస్తీనా' అంటూ నినదించారు. ఆయన చేసిన పాలస్తీనా నినాదంపై బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయే అవకాశం ఉందంటూ కూడా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఒవైసీ సూటిగా స్పందించారు. "వాళ్లు ఏమి చేయాలనుకుంటున్నారో అది చేయనీయండి. నాకు కూడా రాజ్యాంగం అంటే ఎంతో కొంత తెలుసు. ఇలాంటి ఉత్తుత్తి బెదిరింపులకు భయపడేది లేదు" అని ఒవైసీ పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ అన్నారు. తన వ్యాఖ్యలు రాజ్యాంగవిరుద్ధం కావని, అలాంటి నిబంధనలు ఏమీ రాజ్యాంగంలో లేవని అన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి చెబుతుంటారని, తాను కేవలం 'జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా' అనే అన్నానని, ఆ మాటలు రాజ్యంగ విరుద్ధం ఎలా అవుతాయని ప్రశ్నించారు. అక్కడి (పాలస్తీనా) ప్రజలు అనాథలుగా మారారని, పాలస్తీనా గురించి మహాత్మాగాంధీ కూడా చాలా మాట్లాడారని, ఆయన ఏమి మాట్లాడారో ఎవరైనా సరే చదివి తెలుసుకోవచ్చని అన్నారు.

**కిరణ్ రిజిజు ఏమన్నారంటే..**

కాగా, ఒవైసీ ప్రమాణస్వీకార సమయంలో 'జై పాలస్తీనా' నినాదం చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మంగళవారంనాడు అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటులో వేరే దేశం గురించి నినాదం చేయడం తగదని చెప్పారు. పాలస్తీనాతో కానీ ఏ ఇతర దేశంతో కానీ తమకు శత్రుత్వం లేదని, అయితే సభ్యులు ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు నిబంధనలు పాటిస్తున్నామో లేదో సరిచూసుకోవాలని అన్నారు. ప్రమాణస్వీకారం చివర్లో పాలస్తీనా నినాదాలు చేసినట్టు కొందరు సభ్యులు తనకు ఫిర్యాదు చేసినట్టు ఆయన చెప్పారు.

# మోడీ వర్సెస్ సంఘ్...



**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జాతీయ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. బీజేపీకి క్లీన్ మెజారిటీ రాకపోవడం, ప్రభుత్వ ఏర్పాటులో మిత్ర పక్షాలపై ఆధార పడటంతో అడుగడుగునా ప్రధాని మోదీకి సవాళ్ల ఎదురవుతున్నాయి. గతంలో మోదీని గ్లోబల్ లీడర్‌గా ప్రమోట్ చేసిన ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలే ఆయనకు ఇప్పుడు ఇబ్బందికరంగా మారుతున్నారన్న వార్తలు పెరుగుతున్నాయి. గతంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్న మోదీ, అమిత్ షా ఎన్డీఏ 3.0లో అలాంటి పరిస్థితి లేదు. ప్రభుత్వ నిర్ణయాలే కాదు.. పార్టీలో కూడా ప్రధాని మాట ఏకపక్షంగా జరిగే అవకాశం లేదు.ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డానే మోడీ తన కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకున్నారు. దీంతో.. బీజేపీ కొత్త సారధిని ఎన్నుకునే పనిలో పడింది. ఈ విషయంలోనే మోదీ, ఆర్ఎస్ఎస్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోందనే ప్రచారం ఢిల్లీ వర్గాల్లో నడుస్తోంది. మోదీ ఏకపక్ష నిర్ణయాలకు చెక్ పెట్టేలా, వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యం అనే సంకేతాలను పంపేందుకు రాజ్‌నాథ్ సింగ్ లేదా శివరాజ్‌సింగ్ చౌహాన్ పేరును ఆర్ఎస్ఎస్ పరిశీలిస్తోంది. కానీ, మోదీ మాత్రం సునీల్ బన్సాలీ లేదా మహారాష్ట్రకు చెందిన వినోద్ తావ్డేకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని చూస్తున్నారు.ప్రభుత్వం, పార్టీలో ఏక పక్ష నిర్ణయాలు ఉండకుండా చేయాలంటే మోదీ కంటే సీనియర్లు అయిన రాజ్‌నాథ్ సింగ్ లేదా శివరాజ్‌సింగ్ చౌహాన్ ను అధ్యక్షునిగా నియమించాలని ఆర్ఎస్ఎస్ పట్టుబడుతోంది. అవసరమైతే వీరిద్దరూ మోదీ నిర్ణయాలను వ్యతిరేకించేంత బలం ఉన్న నాయకులు. పార్టీలో స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటారని ఆర్ఎస్ఎస్ ఆలోచన. అయితే, మోదీ, అమిత్ షా మాత్రం వీళ్లద్దరికి పార్టీ బాధ్యతలు ఇవ్వకూడదని ఆలోచిస్తున్నారు. మోదీకి శివరాజ్ సింగ్ చౌహాన్ పోటీ అవుతారనే మొన్నటి ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో బీజేపీ భారీ మెజార్టీతో గెలిచినా..ఆయనకు సీఎం పగ్గాలు ఇవ్వకుండా కొత్తవారిని తీసుకొచ్చారు. ఇక రాజ్‌నాథ్ సింగ్ గత పదేళ్లుగా కేంద్ర కేబినెట్‌లో ఉన్నప్పటికీ.. మోదీ, అమిత్ షా కంటే తక్కువ పోర్టు పోలియో ఉన్న శాఖలను ఇస్తున్నారు. ఇలా వీరిద్దరినీ మోదీ తొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, మొన్నటి ఎన్నికల్లో బీజేపీ గ్రాఫ్ ఘోరంగా పడిపోవడంతో ఆర్ఎస్ఎస్ రూపంలో మోదీకి ఎదురుగాలి కనిపిస్తోంది. జాతీయ అధ్యక్షుని విషయంలోనే కాకుండా తెలంగాణ పార్టీ బాధ్యతల విషయంలోనూ, మంత్రివర్గం ఏర్పాటులో కూడా ఆర్ఎస్ఎస్ దే పైచేయి కనిపిస్తోంది.నిజానికి తెలంగాణ నుంచి ఈటల రాజేందర్‌ను కేంద్ర కేబినెట్ లో తీసుకుంటారని అంతా భావించారు. అలా అనుకోవడానికి కూడా కారణం లేకపోలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఈటల రాజేందర్ ఒత్తిడితో బండి సంజయ్ ను పార్టీ బాధ్యతల నుంచి తప్పించారు. కాబట్టి.. కేంద్ర పెద్దల దగ్గర ఈటలకు పలకుబడి ఉందని.. అందుకే ఆయన్ని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటారని చాలా మంది అనుకున్నారు. కానీ, ఎన్నికల ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో.. ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ ను బండి సంజయ్‌కు మంత్రి పదవి వరించింది.ఇక.. ఈటల రాజేందర్‌కు పార్టీ పగ్గాలు అప్పగిస్తారని నిన్న, మొన్నటి వరకూ జోరుగా ప్రచారం జరిగినా.. ఇప్పుడు కౌంటర్ కామెంట్స్ కూడా వినిపిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ మనసులో రామ్ చందర్ రావు, మనోహర్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. 10 రోజుల క్రితం కూడా ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షం అంటే శత్రువు కాదని.. వారికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని అన్నారు. అంటే మోదీని ఉద్దేశించే ఈ కామెంట్స్ చేశారని క్లియర్ గా అర్థం అవుతోంది. దీంతో.. ప్రధాని మోదీకి ఆర్ఎస్ఎస్ అడ్డుపుల్లలు వేస్తుందని స్పష్టం అవుతుంది.

# ఆపరేషన్‌లో పోంగులేటి ప్రత్యేక ఆకర్షణ



**హైదరాబాద్ :** రాజకీయాల్లో ఆ మంత్రి కీలకంగా మారారు. ఎక్కడ ఏ జాయినింగ్ జరిగిన ఆ మంత్రి కనుసన్నల్లోనే అది పూర్తి అవుతుంది. జాయిన్ చేసుకునేది సీఎం అయినా దాని వెనుక ఉండేది మాత్రం ఖమ్మం జిల్లా మంత్రి పోంగులేటి అనే వార్త జోరుగా ప్రచారం జరుగుతోంది. అవును ఈ ప్రచారానికి రోజు రోజుకు బలం చేకూరుతూనే ఉంది. ఎందుకంటే ఆ మంత్రి ఇంప్లూయిన్స్ ఆ రేంజ్?లో ఉంది. ఆయన లేకుండా ఒక్క జాయినింగ్ కూడా జరగడం లేదంటే మంత్రి ఏంత పవర్ పుల్ అనేది అర్థం చేసుకోవచ్చు.ఇక ఈ మధ్య తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ అపరేషన్ ఆకర్ష్ ప్రారంభించింది. దీని కోసం జాగ్రత్తగా ఎమ్మెల్యేలను బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్?లోకి లాగుతున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకిదిగి కండువాలు కూడా కప్పేస్తున్నారు. కానీ ఈ చేరికల వెనుక అపరేషన్ చేస్తున్నది మాత్రం మంత్రి పోంగులేటి అనే టాక్ ఇప్పుడు పార్టీలో, ప్రభుత్వంలో జోరుగా నడుస్తుంది. దీనికి బలం చేకూరుస్తూనే తాజాగా మాజీ స్పీకర్ పోచారం జాయినింగ్?లో కూడా పోంగులేటి కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. సిఎంతో పాటుగా పోచారం ఇంటికి వెళ్లిన పోంగులేటి.. కండువా కప్పి జాయిన్ చేసుకునే వరకు ఎవరికీ అనుమానం రాలేదు. ఆయన చేరికతో బిఆర్ఎస్ షాక్?కు గురైంది. ఆ షాక్?లో నుండి తేరుకోక ముందే ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్?ను రాత్రి 10 గంటల సమయంలో పోంగులేటి సీఎం ఇంటికి తీసుకెళ్లి కాంగ్రెస్ కండువా కప్పించారు.బిఆర్ఎస్?కు అత్యంత విధేయుడు అయిన సంజయ్ అపరేషన్?ను అసలు పార్టీలో ఎవరికీ డౌట్ రాకుండా ఫినిష్ చేసారు పోంగులేటి. ఇక ఈ రెండు సంఘటనలు ఇప్పుడు స్టేట్ పాలిటిక్స్?లో హాట్ టాఫిక్?గా మారాయి. పోంగులేటి సంజయ్ వ్యవహారంలో జీవన్ రెడ్డి హర్ట్ అయినా కూడ లైట్ తీసుకోని మరి సంజయ్?ని తన చాంబర్?లోకి పిలిపించుకోని సపోర్ట్ చేశారట మంత్రి పోంగులేటి. ఇక ఇప్పటికే బిఆర్ఎస్ నుండి జాయిన్ అవ్వాలి అనుకున్న పలువురు ఎమ్మెల్యేలు కూడా వయా పోంగులేటి నుండి పోవడమే బెటర్ అని ఫీల్ అవుతున్నారట. జిల్లాలో ఎవరు ఫీల్ అయినా యూ డోంట్ కేర్ ఐ విల్ దేర్ అంటున్నారట మంత్రి పోంగులేటి. దీంతో అధికార పార్టీ తీర్థం పుచ్చుకుందాం అనుకుంటున్న ఎమ్మెల్యేలకు ఆశాదీపం అవుతున్నారట ఆయన.ఇక ఇప్పుడు జాయినింగ్ ఏదైనా వయా పోంగులేటి అయితేనే బెటర్ అనుకుంటున్నారట పక్కపార్టీ ఎమ్మెల్యేలు. ఇదిలా ఉంటే జిల్లాలలో పొంగులేటిపై కోపంగా ఉన్నారట సీనియర్ మంత్రులు, నేతలు. తమతో సంప్రదింపులు జరపకుండా.. చర్చించకుండా ఎలా జాయిన్ చేసుకుంటారు అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట. ప్రస్తుతం ఇదే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

## వారంలో కొత్త బాస్?

-మొదటిపేజీ తరువాయి

కొత్త ప్రెసిడెంట్ పోస్టు కోసం ఎవరికి వారుగా పలువురు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నియామకంపై ఒక్కొక్కరు ఒక్కో అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. పార్టీలో సీనియర్లకు ఇవ్వాలని కొందరు అంటుంటే.. ఇంకొందరు దమ్మున్న నేతల అవసరం అనివార్యమని చెబుతున్నారు. ఈ తరుణం లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఉన్నపళంగా హస్తినకు బయలుదేరడం చర్చనీయాంశమైంది. ఆయన బీజేపీ అగ్రనేతలతో భేటీ అయిన ట్లు తెలుస్తోంది. అయితే ఆయన ఎలాంటి అంశాలు పెద్దలకు వివరిస్తారనేది ఆసక్తికరంగా మారింది. హైకమాండ్ సైతం ఈ అంశానికి వీలైనంత త్వరగా చెక్ పెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే వారంలో కొత్త ప్రెసిడెంట్ ఎవరనేది తేలనుంది. మరి హైకమాండ్ వారంలో కొత్త సారథిని ప్రకటిస్తుందా? లేక ఇంకా సస్పెన్స్‌లోనే ఉంచుతుందా? అనేది చూడాలి.

## మాజీ మంత్రి పోచారం, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌లపై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

**ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఈ-మెయిల్, స్పీడ్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు**

**పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ఫిర్యాదు**

మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆయన ఈ-మెయిల్, స్పీడ్ పోస్ట్ ద్వారా వారిపై ఫిర్యాదు చేశారు. వారు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో, పార్టీ మారిన ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన సభ సెక్రటరీకి ఆయన ఫిర్యాదు చేశారు.

## రోడ్ల అభివృద్ధికి నిధుల విడుదల చేయండి

-మొదటిపేజీ తరువాయి



సుదీర్ఘంగా నితిన్ గడ్కరీతో చర్చించామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టే అంశంపై చర్చించామన్నారు. విజయవాడ రోడ్డును ఆరు లైన్లుగా మారుస్తామని ప్రకటించారు. హైదరాబాద్ కల్వకుర్తి రోడ్డుపై చర్చించామన్నారు. వారం రోజుల్లో అన్ని శాఖలతో కలిపి మరో సమావేశం పెడతామని తెలిపారు. అన్ని శాఖల నుంచి ఒకేసారి క్లియరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి, శ్రీధర్ బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ తదితరులు పాల్గొన్నారు. కేంద్రమంత్రితో రాష్ట్ర రహదారులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు, ఫ్లైఓవర్ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్డు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులపై గడ్కరీతో చర్చించారని తెలుస్తోంది. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్ల అభివృద్ధితో పాటు అంతర్జాతీయ సంస్థల నుంచి రావాల్సిన నిధుల గురించి చర్చించారు.

## కేసీఆర్ కేసులు ఎత్తివేయాలని కోరడం బాధ్యతారాహిత్యం...


**అలా అయితే మా కేసులూ ఎత్తివేయాలి: కోదండరాం**

**బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని కేంద్రానికి కోదండరాం విజ్ఞప్తి**

**మేడిగడ్డ డిజైన్ ఒకటైతే... నిర్మాణం మరోరకంగా చేశారని ఆరోపణ**

**విచారణ కమిటీని రద్దు చేయించి వాస్తవాలు బయటకు రాకుండా చేస్తున్నారని విమర్శ**

**కేసులు ఎత్తివేయాలని కేసీఆర్ కోరడం బాధ్యతారాహిత్యమే..**



**హైదరాబాద్:** మాజీ సీఎం కేసీఆర్‌పై టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం షాకింగ్ కామెంట్స్ చేశారు. తనపైన ఉన్న కేసులు ఎత్తివేయాలని కేసీఆర్ కోరడం బాధ్యతారాహిత్యమేనని అన్నారు. మేడిగడ్డ డిజైన్ ఒకటైతే.. నిర్మాణం మరొక రకంగా చేయడంతో కుంగిపోయిందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణ మెటిరీయల్ సక్రమంగా లేదు, నిర్వహణ కూడా లేదని డ్యాం సేఫ్టీ అధికారులు చెప్పారని గుర్తుచేశారు. ఈరోజు(బుధవారం) తన కార్యాలయంలో కోదండరాం మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహట్టిని పరిశీలించాలని ప్రభుత్వం, కమిషన్‌ను కోరామన్నారు. ఇంజనీర్ సూచనలను గత ప్రభుత్వం బేఖాతరు చేసిందని మండిపడ్డారు. మేడిగడ్డ ప్రాజెక్టు అవినీతి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని హెచ్చరించారు. కమిషన్ వేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని అసెంబ్లీలో బీఆర్ఎస్ కోరిందని చెప్పారు. విచారణ కమిటీని రద్దు చేయించి.. వాస్తవాలు బయటకు రాకుండా ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బొగ్గు గనులను వేలం వేయడమంటే ప్రైవేటీకరణకు దారి తీయడమేనని చెప్పారు.

## వికటిస్తున్న ఆపరేషన్ ఆకర్ష్

-మొదటిపేజీ తరువాయి

తనకు తెలియకుండా ఆయనను పార్టీలో చేర్చుకోవడం ఏమిటని తాటిపర్తి జీవన్ రెడ్డి ఫీలయ్యారు. నిజానికి ఆయన లాంటి సీనియర్ ఉన్న నియోజకవర్గంలో ఎవరినైనా చేర్చుకునేటప్పుడు రాష్ట్ర పార్టీ నాయకత్వం ముందుగా ఆయనకు సమాచారం ఇవ్వాలి. కానీ ఆయనకు కనీస సమాచారం లేకుండా.. మీడియాలో వచ్చిన తర్వాతే ఆయన తెలుసుకోవాల్సి వచ్చింది. సహజంగానే ఇది ఆయనను అవమానించినట్లు అవుతుంది. అందుకే బహిరంగంగా అసంతృప్తిని తెలిపారు. ఇక తనకు రాజకీయం వద్దని వ్యవసాయం చేసుకుంటానని చెబుతున్నారు. నిజానికి జీవన్ రెడ్డి రేవంత్ రెడ్డికి మద్దతు దారు. పీసీసీ చీఫ్ ఎంపిక సమయంలో సీనియర్ల అభిప్రాయాలను తెలుసుకోవడానికి వచ్చిన కాంగ్రెస్ హైకమాండ్ ప్రతినిధి బృందానికి చాలా మంది రేవంత్ పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినా జీవన్ రెడ్డి మాత్రం మద్దతుగా మాట్లాడారు. రేవంత్ కు పీసీసీ చీఫ్ ఇస్తే పార్టీ బలపడుతుందని చెప్పారు. తన సీనియార్టీని గుర్తించి ఓడిపోయినప్పటికీ ఎమ్మెల్సీగా ఉన్న తనకు మంత్రి పదవి ఇస్తారని ఆయన అనుకున్నారు. ఎంపీగా పోటీ చేయమన్నా చేశారు. అయితే ఇప్పుడు హటాత్తుగా తన నియోజకవర్గంలోనే తనకు ఎర్త్ పెట్టడంతో ఆయన అవమానానికి గురయ్యానని ఫీలవుతున్నారు.ఈ ఒక్క చేరికల విషయంలోనే కాదు.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరే ప్రతి ఒక్క ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఇదే పరిస్థితి ఉంది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కూడా పలువురు బీఆర్ఎస్ నేతల్ని చేర్చుకుని టిక్కెట్లు ఇచ్చారు. వారిలో ఎక్కువ మంది పరాజయం పాలయ్యారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరేవారంతా.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి ప్రయత్నించిన వారే. ఇప్పుడు వారిని చేర్చుకుని కాంగ్రె?స గెలుపు కోసం పని చేసిన వారిని తక్కువ చేయడం ఎందుకన్న చర్చ కాంగ్రెస్ లో జరుగుతోంది. అయితే రేవంత్ రెడ్డి మాత్రం దూకుడుగా ఆపరేషన్ ఆకర్ష్ నిర్వహిస్తు?న్నారు.

## నిమ్జ్ వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

**3 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు**

**వైద్యా, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



**సంగారెడ్డి:** నిమ్జ్ వల్ల ఈ ప్రాంతంలో 3 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని వైద్యా, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. నిమ్జ్ అనేది ఒక అద్భుతమైన ఆలోచన అని చెప్పారు. ఆనాడు 2018లో మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల కోసం 123 జీవో రద్దు చేయాలని ఆసైన్డ్ భూములు పట్టా భూములకు సమానంగా పరిహారం ఇవ్వాలని పోరాటం చేశామని గుర్తుచేశారు. ఈరోజు ( బుధవారం) ఝరాసంఘం మండల కేంద్రంలోని ఎల్గోయి, ముంగి గ్రామాలకు చెందిన 500 వందల ఎకరాల నిమ్జ్ భూ నిర్వాసితులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర్, ఎమ్మెల్యే మాణిక్ రావు, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ... నిమ్జ్‌లో మిగిలిన 900 మంది రైతులకు 2013 చట్టప్రకారం పరిహారం చెల్లించటానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

నిమ్జ్ రావడంతో జహీరాబాద్ నియోజకవర్గ చుట్టుపక్కల గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయని ఉద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ. 50 వేల కోట్ల వరకు పెరుగుతుందని తెలిపారు. రైతు రుణ మాఫీలో భాగంగా 31 వేల కోట్ల రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వం చేయబోతుందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చబోతుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు

## సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు..




**హైదరాబాద్ :** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో జూనియర్ డాక్టర్లు సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వంతో జూనియర్ డాక్టర్లు జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు జూడాలు ప్రకటించారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా హామీతో సమ్మె విరమించినట్లు జూడాలు పేర్కొన్నారు. జూడాలు విధించిన 8 డిమాండ్లలో ఆరింటికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

**ఆరు డిమాండ్లు ఇవే..**

గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెలా స్టైఫండ్ చెల్లించేలా చర్యలు ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల్లో కొత్త హాస్టల్ బిల్డింగ్‌ల నిర్మాణానికి నిదుల కేటాయింపు కాకతీయ మెడికల్ కాలేజీలో సీసీ రోడ్ల పునరుద్ధరణకు నిధుల కేటాయింపు సూపర్‌స్పెషాలిటీ ఆర్డర్‌కు వీలైనంత త్వరగా సవరణ కొత్త మెడికల్ కాలేజీలకు బస్సుల సదుపాయం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎస్పీఎఫ్‌తో డాక్టర్లకు రక్షణ ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీలకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం జీవో జారీ చేసిన సంగతి తెలిసిందే. ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల్లో జూనియర్ వైద్యుల వసతి గృహాల నిర్మాణానికి, కాకతీయ మెడికల్ కాలేజీలో రహదారుల పునరుద్ధరణకు నిధులు కేటాయిస్తూ జీవో విడుదలైంది. ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీలకు రూ. 204.85 కోట్లు కేటాయించారు. ఉస్మానియా వసతి భవనాలు, రోడ్లకు రూ. 121.90 కోట్లు, గాంధీ ఆస్పత్రికి రూ. 79.50 కోట్లు, కాకతీయ మెడికల్ కాలేజీలో సీసీ రోడ్లకు రూ. 2.75 కోట్లు కేటాయించారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి సోనియాగాంధీ ఫోన్

-మొదటిపేజీ తరువాయి

చేశారట. వెంటనే ఢిల్లీకి రావాల్సిందిగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఏఐసీసీ నుంచి పిలుపు వచ్చింది. జీవన్ రెడ్డిని ఢిల్లీకి తీసుకురావాల్సిందిగా విప్ అడ్లూరి లక్ష్మణ్‌ను కాంగ్రెస్ పెద్దలు ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాసేపట్లో జీవన్ రెడ్డి ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిసింది. విప్ అడ్లూరి లక్ష్మణ్ కూడా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితోపాటు ఢిల్లీకి వెళ్లనున్నారు. ఇక అంతకుముందు కాంగ్రెస్ వైఖరిపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కంటతడి పెట్టుకున్నారు. కాంగ్రెస్ మానిఫెస్టోలో ఎమ్మెల్యే పార్టీ మారితే సభ్యత్వం రద్దు చేస్తామని పెట్టారని, ఇప్పుడు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను పార్టీలో ఎలా చేర్చుకుంటారని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఎమోషనల్ అయ్యారు. ఇన్నేండ్లు ఎవరి మీద కొట్లాడానో వారినే నాకు మాట కూడా చెప్పకుండా చేర్చుకున్నారని అన్నారు. తన భవిష్యత్తును కాలమే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి - ఎమ్మెల్యే అనిల్ జాదవ్





**వాస్తవ నేస్తం భీంపూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఇందిరమ్మ కానుకగా ఇచ్చే ఒక లక్ష, తులం బంగారం పథకం వెంటనే అమలు చేస్తే లబ్ధిదారులకు లాభం చేకూరుస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం భీంపూర్ మండల కేంద్రం లోని అంగడి సంత మైదానంలో ఏర్పాటు చేసిన సమవేశంలో వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు, నాయకులతో కలిసి కళ్యాణ లక్ష్మి, శాది ముభారక్ చెక్కులను పంపిణీ చేశారు..మండలంలోని ధనోర గ్రామానికి చెందిన బేబి తరణ్య కు రూ.150,000/- వేల ఎల్ఓసీ నీ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మాజీ సీఎం కెసిఆర్ హయాంలో పేద ప్రజల కొరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిపారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు..మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో,పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని అన్నారు.

**రోడ్డు పనులు ప్రారంభించే చర్యలు తీసుకుంటాం..**

మండలంలో సమస్యగా మారిన కరంజి అంతర్రాష్ట్ర రోడ్డు కాంట్రక్టర్ నిర్లక్ష్యం వలన ఆలస్యం అవుతుందని, సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి త్వరలోనే పనులు ప్రారంభించేల చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ అప్లికేషన్లను పెండింగ్ లో ఉంచవద్దని వెంట వెంటనే ఎమ్మేలే కార్యాలయానికి పంపించాలని తహసీల్దార్ ను ఆదేశించారు.అనంతరం నీపాని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుమ్ర సుధాకర్,తహసీల్దార్ సత్యనారాయణ,ఎంపీపీ రత్న ప్రభ సంతోష్,మండల కన్వీనర్ మేకల నాగయ్య,వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్నా,కో ఆప్షన్ సభ్యుడు జాహుర్ అహ్మద్,మాజీ సర్పంచ్ మడావి లింబాజీ,నాయకులు గోవర్ధన్ యాదవ్,సంజీవ్ రెడ్డి, నరేందర్ యాదవ్, మర్చెట్టీ అనిల్,రవీందర్ జాదవ్, ముకుంద్ సంతోష్, ధరం సింగ్,షేక్ రౌఫ్,సయ్యద్ బాదర్, యువకులు షేక్ ఆఫ్రొజ్, బొంత నితిన్,ప్రవీణ్,ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాల దోపిడి అరికట్టాలి: టీజీవీపీ

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో అవినీతి రాజ్యమేలుతుందని నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తూ, యూనిఫార్లు, పుస్తకాలు పాఠశాలలోనే దుకాణాలు తెరిచి బహిరంగంగానే అమ్ముతున్నారు అని టీజీవీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ ఆరోపించారు. వేలాది రూపాయలు తల్లిదండ్రుల నుండి పిండి వసూలు చేస్తున్నారని, ఇదంతా తెలిసి కూడా ఉన్నత విద్యాధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం జరిగింది కాదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలకు తోక పేర్లు నిషేధం ఉన్నప్పటికీ కూడా పలు ప్రభుత్వ పాఠశాల యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేలా తోక పేర్లు పెట్టిన కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏంటి అని ఆయన ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణ, బోథ్ నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్, కో కన్వీనర్



సతీష్, సాయి, గణేష్, పవర్ అఖిల్, జాదవ్ కళ్యాణ్ చౌహాన్ విశాల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలిద్దాం

**భావితరాలకు మంచి భవిష్యత్తుని అందిద్దాం**

**డ్రగ్స్ నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**రాజన్న సిరిసిల్ల :** మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం పురస్కారించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పంతో డ్రగ్-రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు, యువత, విద్యార్థులతో కలసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానం నుండి అంబేద్కర్ చౌరస్తా, నేతన్న చౌరస్తా గాంధీ మీదుగా మరక కళాశాల గ్రౌండ్ వరకు కొనసాగిన ర్యాలీ, ప్రత్యేక ఆకర్షణగా మాదకద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను తెలియజేస్తూ రూపొందించిన ప్లకార్డులు, కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. డ్రగ్స్ నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దాం అని ఎస్పీ పిలుపునిచ్చారు. యువత గంజాయి లాంటి మత్తుపదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తు వైపు నడుచుకోవాలని తెలిపారు. సమాజంలో ప్రభుత్వం నిషేధించిన మాదక ద్రవ్యాలు సమూలంగా నిర్మూలించటలో యువత, ప్రజలు పోలీసువారికి సహకరించుటలో కీలక పాత్ర పోషించాలని కోరారు. యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అలాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నత విజయాలను చేరుకొని తల్లిదండ్రులకు మంచి పెరు తీసుకరవాలని అన్నారు. జిలాల్లో



గంజాయి, డ్రగ్స్ నిర్మలనకు జిల్లాలోని కళాశాలలో, పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ క్లబ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అవగాహన ర్యాలీలు చేపట్టి పెద్దఎత్తున విద్యార్థుల కు, యువతకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గంజాయి లాంటి మత్తుపదార్థాలకు సంబందించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో నెంబర్ 8712671111 కి లేదా డయల్100 లేదా మీ పరిధిలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ లు రఘుపతి, మాధుకర్, ప్రవీణ్ కుమార్, ఆర్ఐ లు యాదగిరి, మాధుకర్, రమేష్,జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి లక్ష్మీరాజాం, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ ,పోలీస్ సిబ్బంది, పలు పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అనాధ శవాలకు అంత్యక్రియలు నిర్వహించిన ఎండిఆర్ ఫౌండేషన్

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం రుద్రారం గ్రామ సమీపంలో గణేష్ గడ్డ దేవాలయం వద్ద యాచకుడిగా ఉన్నటువంటి వృద్ధుడు చనిపోగా, అదేవిధంగా తోషిబా కంపెనీ సమీపంలో గుర్తుతెలియని మృతదేహానికి ఎండిఆర్ ఫౌండేషన్ సభ్యులు అంతక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.



## మాకి నాంపే ఏక్ పెడ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన బీజేపీ నాయకులు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన ప్రతి కుటుంబం మాకీ నాంపే ఏక్ పెడ్ అనే కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు మాకినాంపే ఏక్ పెడ్ అని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, కొలుకూరు రాజశేఖర్ రెడ్డి, మాణిక్ రావు, రాష్ట్ర నాయకులు రాజేశ్వరరావు, దేశ్ పాండే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదెల్లి రవీందర్, ఎడ్ల రమేష్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ చిన్న పాటిల్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, పోచారం రాములు, ఒంటేరు ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున, పార్టీ కార్యదర్శి ఎల్లన్న,కార్యాలయ కార్యదర్శి విజయ్ కుమార్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు కసిని వాసు, యువమోర్చా జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్లు శ్రీనివాస్ గుప్తా, జగన్నాథ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మీనా గౌడ్, నర్సింగ్ రావు, మరియు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**-మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి**

**మంథని :** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మంథని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్పర్సన్ పెంద్రి రమ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో వర్షాకాలంలో సంభవించు పలు సమస్యల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశాన్ని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి నిర్వహించారు. మంథని మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని గద్దలపల్లి పి.హెచ్.సి డాక్టర్ ఎం సృజన్ తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బందితో ఇనుప పోల్స్ మరియు చెట్లపై వున్న వైర్స్ లాంటివి ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి కావున వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.మంథని మున్సిపాలిటీలో ప్రతి వార్డుకు వార్డు ఆఫీసర్ ప్రజల యొక్క అవసరాలను తెలుసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.మెప్మా ఆర్పి లతో వర్షాకాలంలో ప్రజలకు సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ప్రజల అవసరాలను తెలుపుటకు మున్సిపల్ కార్యాలయం నందు టోల్ ఫ్రీ నెంబర్లు 96663 02954, 90598 95197 కేటాయించారు. మంథని మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చైర్ పర్సన్ రమా సురేష్ రెడ్డి తెలిపారు.

## పోచారం, సంజయ్‌పై అనర్హత వేటుకు ప్రయత్నం

**హైదరాబాద్ :** పార్టీ మారుతోన్న ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం బీఆర్ఎస్ పార్టీ తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అందులోభాగంగా తాజాగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్‌పై అనర్హత వేటు వేయాలని తెలంగాణ స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. అందుకోసం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద కుమార్ అపాయింట్‌మెంట్‌ను మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కోరారు. అయితే స్పీకర్ అందుబాటులో లేరని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో నేరుగా స్పీకర్ నివాసానికి వెళ్లి వీరిపై అనర్హత వేటుకు చర్యలకు ఉపక్రమించాలని బీఆర్ఎస్ పార్టీ నేతలు నిర్ణయించినట్లు తెలుస్తుంది. గతేడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీ పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం రేవంత్ రెడ్డి చేపట్టి ఆపరేష్ ఆకర్ష్‌లో బీఆర్ఎస్ పార్టీలోని అగ్రనేతలంతా కాంగ్రెస్ పార్టీలోకి క్యూ కట్టారు. ఆ క్రమంలో తాజాగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి.కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి

**పెద్దపల్లి :** డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రబావాల పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్ అన్నారు. బుధవారం పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్ అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి సమీకృత జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో అదనపు కలెక్టర్ లు జే.అరుణశ్రీ, జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com